క్లుప్తంగా

రేషన్ కార్డు నిబంధన తొలగించాలి

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే రేషన్ కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందనే నిబంధనను తొలగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం డిమాండ్ చేశారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, రూ.2 లక్షలపైన ఉన్న అప్పును చెల్లిస్తేనే రైతులకు రుణమాఫీ అవుతుందనే నిబంధనను పరిశీలించాలన్నారు. 2018 కంటే ముందున్న అప్పులను కూడా రుణమాఫీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

పాములతో పంటలకు మేలు

సిద్దిపేటఎడ్యుకేషన్: పాములు చాలావరకు విషరహితమైనవేనని, అవి పొలాల్లో ఎలుకలను ఆహారంగా తీసుకుని పంటలకు నష్టం కలగకుండా రైతులకు మిత్రులుగా ఉంటాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పాముల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అయోధ్యరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు పాముల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. పామును చంపకూడదని, అది విషపూరితమైనదా? కాదా? అనే విషయాన్ని నిర్ధారించుకోవాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. ఎక్కువగా నాగుపాము, కట్లపాము, రక్తపింజర విషపూరితమనవే కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర అధ్యాపకులు విశ్వనాథం, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పుణ్యమ్మ, వెంకటేశం, చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఇసుక బహిరంగ వేలం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం వేలూరు సమీప గురువన్న గుట్ట వద్ద సీజ్ చేసిన రెండున్నర లారీల ఇసుక డంప్‌ను వాల్టా చట్టం ప్రకారం బహిరంగ వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ బాల్‌రాజు మంగళవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఇసుక సీజ్ చేసిన ప్రదేశంలోనే వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

మిట్టపల్లిలో అంగన్‌వాడీ బాట

సిద్దిపేటఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం మిట్టపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ర్యాలీ తీశారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, శోభ, మంజుల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వీరాచారి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారిని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వీరాచారి మాట్లాడుతూ బూత్ అధ్యక్షుడి నుంచి మండల అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సీత్లా పండుగ

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులు సీత్లా పండుగను వైభవంగా జరుపుకుంటారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని పంతులీతండా, కపూర్‌నాయక్‌తండా, పెద్దతండా, బోదర్‌వాగుతండా వాసులు జరుపుకున్నారు. తండాల సరిహద్దుల్లోని కూడలి వద్ద సీత్లా భవానీ అమ్మవారిని ప్రతిష్ఠించారు. పురుషులు డప్పు వాయిద్యాలు వాయిస్తుండగా, మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారు ఉన్న ప్రదేశానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి గుగ్గిళ్లు, లాప్సి పాయాసం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బొడ తండాలో ..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని వంగరామయ్యపల్లి పంచాయతీ పరిధి బొడ తండాలో మంగళవారం గిరిజనులు సీత్లా భవానీ పండుగను జరుపుకున్నారు. పంటలు బాగా పండాలని, పశుసంపద పెరగాలని కోరుతూ సీత్లా భవానికి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగ విజయలక్ష్మీ, బొడ రవి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న కపూర్‌నాయక్ తండా మహిళలు

మొక్కలు నాటేలా.. లక్ష్యం చేరేలా

సకాలంలో వర్షాలు కురియాలంటే అటవీ విస్తీర్ణం పెంచాలని గత ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు హరితహారం కార్యక్రమాన్ని ఏటా నిర్వహించింది. ప్రస్తుతం ప్రభుత్వం కూడా వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ గ్రామానికి నాలుగు వేల మొక్కలు నాటాలని ఆదేశించింది. వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొక్కలు నాటి సంరక్షించాలని కోరుతున్నారు.

- హరిత తెలంగాణకు వన మహోత్సవం
- ఏర్పాట్లుచేసిన అధికారులు
- ఇంటింటికి మొక్కలు పంపిణీ
- గ్రామంలో 4 వేల మొక్కలు నాటాలని ఆదేశం



ఇబ్రహీంనగర్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): హరిత తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం హరితహారం పేరుతో మొక్కల పెంపకం చేపట్టగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటుతూ అటవీ విస్తీర్ణం పెంచడానికి చర్యలు తీసుకుంది. ఇందుకుగాను నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టింది. సంరక్షణకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మొక్కలు ఏపుగా పెరిగి ప్రస్తుతం నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతీ గ్రామంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొక్కలు నాటేందుకు వారం నుంచి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకంలో కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు.

మొక్కల పెంపకం

మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో ఆయా నర్సరీల్లో 30 రకాల మొక్కలు పెంచుతున్నారు. అలాగే ప్రజలకు అవసరమయ్యే పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతోనే వన మహోత్సవానికి ఆలస్యమైందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు. అందుకు అవసరమైన మొక్కలు సిద్ధం చేశారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు. ప్రతీ గ్రామంలో నాలుగు వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

లక్ష్యం నెరవేరేనా?

మండలంలో 80 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించారు. కాగా ఇప్పటి వరకు 35 వేల మొక్కలు మాత్రమే నాటారు. కొన్ని గ్రామాల్లో గుంతలు తవ్వుతున్నారు. ప్రతీ గ్రామంలో నాలుగు వేల మొక్కలు నాటాలి. చాలా గ్రామాల్లో వెయ్యి మొక్కలు కూడా నాటలేదు. సకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

80 వేల మొక్కలు లక్ష్యం

మండలంలో 80 వేల మొక్కలు నాటాలని ఆదేశించాం. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. ప్రజలు సహకరించాలి. నాటిన ప్రతీ మొక్క బతికేలా చర్యలు తీసుకుంటున్నాం. అందరి సహకారంతోనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. సకాలంలో వర్షాలు కురియాలంటే మొక్కలు నాటాలి.

– జనార్దన్, ఎంపీడీఓ

పర్యావరణాన్ని కాపాడుదాం

గజ్వేల్‌రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పిలుపునిచ్చారు. 75వ వన మహోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నర్సయ్యతో కలిసి మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత మనందరిదన్నారు. ప్రజలకు అవసరమైన పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ క్రాసింగ్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనుల్లో అధికారులు భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో వాహన దారులకు శాపంగా మారింది. రూ.15 కోట్లతో కల్వర్టులతో కలిపి నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నిబంధనలు పాటించడంలేదు. బీటీ తవ్వి రెండు వైపులా మట్టి పోశారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు అదుపుతప్పి కిందపడి స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోహెడ రోడ్డు విస్తరణ పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయని సూచిక బోర్డులు

పబ్లిక్ టాయిలెట్లను వినియోగించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా పబ్లిక్ టాయిలెట్లను వినియోగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్ల వద్ద సఫారీ అప్నే బీమారి భగావో అనే కార్యక్రమం నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయం సమీప పబ్లిక్ టాయిలెట్, షీ టాయిలెట్ల పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, టాయిలెట్లలో స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యర్థాలను మురికి కాలువల్లో వేయకూడదన్నారు. తడి, పొడి, హానికర చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించాచరు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పున్న లావణ్య, పెరుక భాగ్యరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

వైభవంగా త్రిరాత్రోత్సవాలు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని భవానందాపూర్ పాండురంగాశ్రమంలో త్రిరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం ఆశ్రమంలో స్వామివారికి పుణ్యాహవాచనం, గురు ప్రార్థన, అనంతరం అఖండ హరేరామ నమస్మరణకు అంకురార్పణ, క్షీరాభిషేకం, పురుష సూక్త పారాయణాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి సేవలో పునీతులయ్యారు. 93వ ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల జిల్లా రామాయంపేటకు చెందిన విధు మౌళి శాస్త్రి భక్త బృందం భజన కార్యక్రమం నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

23న ఇసుక వేలం

చిన్నకోడూరు(సిద్దిపేట): సీజ్ చేసిన ఇసుకను ఈనెల 23వ తేదీన చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ జయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న మూడు లారీల ఇసుకను పోలీసులు పట్టుకున్నారన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

రుణమాఫీపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

బెజ్జంకి(సిద్దిపేట): రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరిట వారిని ఆందోళనకు గురి చేస్తోందని బెజ్జంకి మాజీ ఎంపీపీ లింగాల నిర్మల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. బెజ్జంకిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనందున వెంటనే రుణమాఫీతోపాటు రైతుభరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్, నాయకులు లింగాల లక్ష్మణ్, గుబిరె మల్లేశం, నరేష్, శేఖర్‌బాబు, దుర్గ సుదర్శన్, బాబుమియా, మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ నిర్మల

డీఎస్పీ మహాసభను జయప్రదం చేయండి

హుస్నాబాద్: సిద్దిపేట కేంద్రంలో 28న నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో పార్టీ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంచల ఎల్లన్న, నాయకులు శేఖర్, ప్రశాంత్, కిషోర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): సాగునీటి కోసం గోదావరి జలాలతో తపాస్‌పల్లి, వెల్దండ రిజర్వాయర్లను నింపి కాలువల ద్వారా చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దూళ్మిట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ శ్యామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరినార్లు పోసిన రైతులు వర్షాలు లేక ఆందోళన చెందుతున్నారన్నారు. రిజర్వాయర్‌ను నింపి సాగునీరు అందించే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే గోదావరి జలాలతో రిజర్వాయర్‌ను నింపాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చొప్పరి ప్రసాద్, ప్రభాకర్, మహేష్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటజోన్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వర్షాకాలంలో పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. మంగళవారం 7వ వార్డులో పర్యటించారు. వార్డులో అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులను త్వరగా పూర్తిచేసి అన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలన్నారు. వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలని, వర్షాకాలంలో ఇంటిలో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. వార్డులో శిథిలావస్థకు చేరిన ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు.

అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

మున్సిపల్ చైర్మన్ మంజుల



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదగాలని మున్సిపల్ చైర్మన్ మంజుల అన్నారు. మంగళవారం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట అన్ని క్రీడలకు అనుకూలంగా ఉందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ముందుచూపుతో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈనెల 29 వరకు జరగనున్న శిక్షణ శిబిరంలో మెలకువలు నేర్చుకొని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో కోచ్ అక్బర్, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు సాజిద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



రోదిస్తున్న రైతు రూప్‌సింగ్

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత పడింది. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రం పరిధిలోని బోదర్‌వాగుతండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రైతు గుగులోతు రూప్‌సింగ్ ఎప్పటిలాగే తన వ్యవసాయ క్షేత్రంలో గేదెను మేత మేసేందుకు వదిలాడు. అయితే రోడ్డు పక్కనే ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గేదె మేత మేస్తూ వెళ్లి దానిని తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని రూప్ సింగ్ తెలిపాడు.

అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

కోహెడ(హుస్నాబాద్): నిరుద్యోగ సమస్యలపై అఖిల పక్షం సమావేశం నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్సీ పరీక్షలను రెండు నెలలు వాయిదా వేసి, ఆ పోస్టులను 25 వేలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

తపాలశాఖలో అధునాతన సేవలు



మాట్లాడుతున్న ఐపీపీబీ మేనేజర్ శ్రవణ్‌కుమార్

సిద్దిపేటఎడ్యుకేషన్: అధునాతన సేవలతో తపాలశాఖ ముందుకు సాగుతోందని వక్తలు అభిప్రాయపడ్డారు. కాలానుగుణంగా మారుతూ బ్యాంకింగ్, పాస్‌పోర్టుతో పాటు బీమా రంగంలోనూ సేవలందిస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తపాలశాఖ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిద్దిపేట పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్, ఐపీపీబీ మేనేజర్ శ్రవణ్ కుమార్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హర్షవర్ధన్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఆధార్, ఇండియా పోస్ట్‌పేమెంట్ తదితర సేవలను పోస్టాఫీసులో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో పోస్టాఫీసులు ఉన్నాయని, డిజిటల్ అకౌంట్స్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రజలు పోస్టల్, బ్యాంకుతో పాటు ఇతర సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్ ఇన్స్‌పెక్టర్ సంతోష్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు అశోక్, నగేష్, రఘురాజు, గంగాధర్, ప్రసాద్, సత్యం, విజయభాస్కర్, ఫాతిమ, నవనీత, ఖుర్షిదతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏసీటీఓకు ఘన సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీఓగా పదవీ విరమణ పొందిన మండలంలోని గూడెం గ్రామస్తుడు నారెడ్డి ముత్యంరెడ్డి, భారతి దంపతులను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. 37 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించినందుకు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి ప్రభుత్వం బీసీలను ఆదుకోవాలని బీఎస్పీ సీనియర్ నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బీసీ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైఎస్ హయాంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారని, కేసీఆర్ పాలనలో 19 శాతం అమలు చేసీ బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు దెబ్బేట యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, రెహమాన్, సత్తయ్య పాల్గొన్నారు.

◆ హుస్నాబాద్ ఎంపీఓ బదిలీ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ మంగళవారం నంగునూరుకు బదిలీ అయ్యారు. ఆరేళ్లు హుస్నాబాద్‌లోనే విధులు నిర్వహించారు. ఈయనతో పాటు మీర్జాపూర్ కార్యదర్శి శారద, బంజేరుపల్లి కార్యదర్శి శ్రీలత కూడా బదిలీ అయినట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.

◆ ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా గణపతిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఈయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. గణపతిరావును అధ్యాపకులు సన్మానించారు.

◆ కోర్టు తీర్పుపై హర్షం

సిద్దిపేటజోన్: విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు హర్షణీయని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాధవ్, వంశీతో కలిసి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. అక్రమ కేసులతో కేసీఆర్‌ను ప్రజల నుంచి ప్రభుత్వం దూరం చేయలేదన్నారు.

◆ విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీయొచ్చు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఓ హైస్కూల్‌లో మంగళవారం కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రెస్మా స్టేట్ వర్కింగ్ ప్రసిడెంట్ జెగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చన్నారు. ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాలను వస్తువులను పరిశీలించారు.

◆ నాయీ బ్రాహ్మణులకు పెన్షన్ ఇవ్వాలి

కొండపాక(గజ్వేల్): 50 ఏళ్లు నిండిన నాయీ బ్రాహ్మణులకు పెన్షన్ ఇవ్వాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరాల వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సింగిరాల శ్రీనివాస్, కొత్వాల్ నరేందర్, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.